# 50 వేల ఎకరాల్లో ఐటీ, హార్డ్‌వేర్ అభివృద్ధి!

సాక్షి 9/9/2012



- హైదరాబాద్‌లో 'ఐటీఆర్': మంత్రి పొన్నాల
- ప్రాథమికంగా ఆమోదించిన కేంద్రం
- మాదాపూర్, గచ్చిబౌలి, ఎయిర్‌పోర్ట్, రింగ్‌రోడ్డు, ఉప్పల్ ప్రాంతాల ఎంపిక

హైదరాబాద్, న్యూస్‌లైన్: జంటనగరాల పరిసరాల్లోని 50 వేల ఎకరాల్లో ఐటీ, హార్డ్‌వేర్ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికకు కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. మూడు నెలల్లోగా సవివరమైన ప్రాజెక్టు నివేదిక పంపితే తుది అనుమతులు వస్తాయని చెప్పారు. శనివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే ఐటీ రంగ అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే ముందుంటుందని వివరించారు. ఐటీ పరిశ్రమల సమగ్రాభివృద్ధికి 2008లో కేంద్రం రూపొందించిన విధానానికి అనుగుణంగా సమర్పించిన ప్రతిపాదనలను కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఆధ్వర్యంలోని 'హైపవర్ కమిటీ' ఇటీవల ప్రాథమికంగా ఆమోదించినట్లు వెల్లడించారు. మంత్రి తెలిపిన వివరాల మేరకు రాష్ట్రంలో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్'(ఐటీఐఆర్) స్వరూపం ఇలా ఉంటుంది.

- హైదరాబాద్ పరిసరాల్లో 202 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో(సుమారు 50 వేల ఎకరాలు) 'ఐటీఐఆర్' ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలి. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో 80 చదరపు కిలోమీటర్లను, అంతర్జాతీయ విమానాశ్రయ పరిసరాల్లో 80 చ.కి.మీ. తోపాటు ఉప్పల్‌లో 10 చ.కి.మీ, ఔటర్ రింగ్‌రోడ్డుకు ఇరువైపులా 32 చ.కి.మీ.ల పరిధిలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో 'ఐటీఐఆర్' ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలి.
- ప్రాజెక్టుకు అంతర్గత మౌలిక సదుపాయాల కల్పనకు 25 సంవత్సరాల్లో రూ.13 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. మిగతా సదుపాయాల కల్పనకు (ఎక్స్‌టర్నల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ. 2,189 కోట్లను కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది.
- 'ఐటీఐఆర్'తో ఐటీ ఎగుమతులు రూ.50 వేల కోట్ల నుంచి రూ. 2.35 లక్షల కోట్లకు పెరిగే అవకాశం.
- ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పరికరాల తయారీ రూ.6 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్లకు పెరుగుతుంది.
- నేరుగా ఉద్యోగాలు పొందేవారి సంఖ్య 3 లక్షల నుంచి 15 లక్షలకు చేరుకుంటుంది.
- పరోక్షంగా 50 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది.
- ఐటీ రంగంలో ప్రస్తుతం ఉన్న 4 కోట్ల చ.అ. నిర్మాణాలు 13 కోట్ల చ. అడుగులకు చేరుకుంటాయి.